
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
శుక్రవారం 10 జనవరి 2025



ఆగని ఇసుక అక్రమ రవాణా..

- ప్రభుత్వ పనుల పేరుతో ప్రైవేట్‌లో అమ్మకాలు
- రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా తరలింపు
- బుకింగ్‌లు లేక ట్రాక్టర్ యజమానుల అవస్థలు
- సిబ్బంది వేతనాలకు కష్టంగా ఉందంటూ ఆవేదన
- వెలవెలబోతున్న సర్కారు ఇసుక రీచ్



తెల్లవారే సరికి పాతమంచిర్యాలలో వెలసిన ఇసుక రాశులు

మంచిర్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వపరంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పేరుతో ఇసుకను తరలిస్తున్న వ్యాపారులు దాన్ని పక్కదారి పట్టించి పెద్ద మొత్తంలో ప్రైవేటులో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అదికూడా ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేనిచోట గోదావరి నుంచి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఫిర్యాదులు అందిన సందర్భంలో తప్ప మిగిలిన సమయాల్లో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించడంలేదనే విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ పనుల పేరుతో...

జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో హిందూ శ్మశాన వాటిక నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వపరమైన అభివృద్ధి పనులు కావడంతో నిర్మాణానికి అవసరమైన ఇసుకను గోదావరి నుంచి వినియోగించుకునే వెసులుబాటును ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కల్పించారు. ఇసుకను తరలించే బాధ్యతను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గోదావరిలో తవ్వుతున్న ఇసుకను సదరు కాంట్రాక్టర్ శ్మశాన వాటిక పనులకు వినియోగించాల్సి ఉండగా, రాత్రివేళల్లో ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బుధవారం రాత్రి టిప్పర్ల ద్వారా తరలించిన ఇసుకను పాత మంచిర్యాలలోని పార్క్ సమీపంలో నిల్వ చేశారు. ఆ ఇసుకలో పాత దుప్పట్లు, వస్త్రాలు ఉండటంతో గోదావరిలోని పుష్కరఘాట్ సమీపంలో నుంచి తరలించారని పలువురు ట్రాక్టర్ యజమానులు చెబుతున్నారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుక రాశులను గురువారం ఉదయం పలువురు ట్రాక్టర్ యజమానులు పరిశీలించారు. అక్రమంగా నిల్వచేసిన ఇసుక సుమారు 70ట్రాక్టర్ల వరకు ఉంటుందని, అక్రమార్కుల కారణంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన రీచ్‌లో తమ ట్రాక్టర్లకు బుకింగ్‌లు దొరకడం లేదని వాపోయారు. అక్రమ ఇసుక నిల్వలపై మైనింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

వెలవెలబోతున్న ప్రభుత్వ ఇసుక రీచ్....

ప్రజల అవసరాల నిమిత్తం ఇసుకను అధికారికంగా తరలించేందుకు హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద గోదావరిలో ప్రభుత్వపరంగా నవంబరు 16న రీచ్ ఏర్పాటు చేశారు. ఇసుక రీచ్‌ను ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, ఆర్డీవో శ్రీనివాసరావు, మైనింగ్ ఏడీ జగన్మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులకు.. మిగతా 5లో

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

గర్మిళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ప్రజలు ఆందోళన చెందవద్దని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లాలో వైరస్ లేదని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ హెచ్‌ఎంపీవీ వైరస్ సోకితే దగ్గు, జ్వరం, ముక్కుదిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందన్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉంటే బ్రాంకైటీస్ నిమోనియో వంటి సమస్యలకు దారి తీయవచ్చన్నారు. ఈ వైరస్‌ను నివారించాలంటే చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, ముఖానికి మాస్క్ ధరించాలని, భౌతికదూరం పాటించాలన్నారు. ఇంట్లో వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల ద్వారా ముందస్తు చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగా జిల్లాలో 1043 పడకలను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి 18 అంబులెన్స్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లా మాస్‌మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, ఎపిడమాలజిస్టు సుమన్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాల కోసం భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు, భోజనం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ఇమ్రాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ మహ్మద్ అజాదొద్దీన్, ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు ఉన్నారు అనంతరం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో తగిన సౌకర్యాలు లేనందున కలెక్టర్ మాదారం టౌన్‌షిప్‌లో ఉన్న సింగరేణి పాఠశాల భవనం, సీఐఎస్ఎఫ్ క్యాంపు భవనాన్ని పరిశీలించారు. సింగరేణి సీఎండీతో మాట్లాడి తాండూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను మాదారంలోకి మారుస్తామని తెలిపారు. ఎస్ఐ సౌజన్య, తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



మాట్లాడుతున్న జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జీ లింగారెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యాలయంలో గురువారం మండల అధ్యక్షులను జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జీ బద్దం లింగారెడ్డి ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆమోదంతో 14 మండలాలకు అధ్యక్షులను ప్రకటించామన్నారు. త్వరలోనే మరిన్ని మండలాల అధ్యక్షులను ప్రకటిస్తామన్నారు. మంచిర్యాల అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, నస్పూర్ అధ్యక్షుడిగా సత్రం రమేష్, హాజీపూర్ గడ్డం స్వామిరెడ్డి, లక్సెట్టిపేట హరిగోపాల్, రూరల్ అధ్యక్షుడిగా హేమంత్‌రెడ్డి, బెల్లంపల్లి అధ్యక్షుడిగా కళ్యాణి, తాండూర్ భరత్, నెన్నెల శేఖర్, భీమిని సత్యనారాయణ, వేమనపల్లి మధుకర్, చెన్నూరు రూరల్ రాజశేఖర్, భీమారం శంకర్, క్యాతనపల్లికి ఠాకూర్ ధన్‌సింగ్, మందమర్రిరూరల్‌కు జనార్దన్‌లను నియమించారు. నాయకులు రజనీష్ జైన్, అశోక్, పురుషోత్తం, వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, కృష్ణదేవరాయలు, నాగేశ్వర్‌రావు, సంజీవరావు, రాకేష్ పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా...జాగ్రత్త : సీపీ

మంచిర్యాల క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకి ఊరెళ్తున్నారా... జాగ్రత్త. పోలీసు సూచనలు పాటించండి, చోరీల నివారణకు సహకరించండని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సంక్రాంతి సెలవులకు సొంత ఊళ్ళకు, విహార యాత్రలకు వెళ్లే వారు గ్రామాల, కాలనీ, అపార్టుమెంట్ వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. ఊరు వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి ఆభరణాలు, బ్యాంకు లాకర్‌లో భద్రతపర్చుకోవాలన్నారు. ఊరికి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వాహనాలను పార్కింగ్ చేస్తే చైన్‌తో లాక్ వేయాలన్నారు. ఇంట్లో స్వీయ రక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు సూచనలు పాటించి దొంగతనాల నివారణకు పాటుపడాలని తెలిపారు.

రహదారి భద్రత ఏదీ?

- రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిపాలు
- గతేడాది 132 మంది మృతి, 434 మందికి గాయాలు
- డ్రంకెన్ డ్రైవ్, అతి వేగమే కారణం

5



రోడ్డు భద్రతపై పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లేక్సీ

ప్రతిభ చాటితే ఆదర్శమే...

- మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ
- 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు

4



కోటపల్లిలోని ఆదర్శ పాఠశాల

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ఆర్కేపీలో అస్మిత ఖేలో ఇండియా పోటీలను ప్రారంభించిన ఎంపీ



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

రామకృష్ణాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీటవేస్తోందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ అన్నారు. గురువారం సింగరేణి ఠాగూర్ స్టేడియంలో అస్మిత ఖేలో ఇండియా అండర్ -13 ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ 2024-2025 టోర్నమెంట్‌ను ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమయ్యే చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తసుకువస్తానన్నారు. రామకృష్ణాపూర్‌లో క్రీడా పాఠశాలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఖమ్మం, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్, ఆదిలాబాద్, పీకేఆర్ 11 సాకర్‌క్లబ్, గజ్వేల్ ప్రాంతాలకు చెందిన బాలికల జట్లు పోటీల్లో పాల్గొనగా క్రీడాకారులచే ఎంపీ గౌరవ వందనం స్వీకరించి పోటీలను ప్రారంభించారు. 13వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.50వేలు, రూ.30వేలు, రూ.20 వేల నగదుతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. మందమర్రి జీఎం దేవేందర్, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పాల్గున, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ సతీష్, సింగరేణి పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, పల్లే రాజు, రాజయ్య, అబ్దుల్ అజీజ్, శ్రీనివాస్ గౌడ్, సమ్మయ్య, రామడుగు లక్ష్మణ్, అక్బర్, సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు పడిగాపులు

- దళారులకు కొమ్ముకాస్తున్న సీసీఐ అధికారులు, మిల్లు యజమానులు - రైతుల ఆవేదన



మిల్లు యజమానిని నిలదీస్తున్న రైతులు

తాండూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీసీఐ అధికారులు, జిన్నింగు మిల్లు యజమానులు దళారులకు కొమ్ము కాస్తున్నారని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రేపల్లెవాడలోని జిన్నింగు మిల్లు యజమానులతో వాగ్వాదానికి దిగారు. రైతులు మాట్లాడుతూ పత్తి మిల్లు వద్ద రైతుల కంటే వ్యాపారులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ ద్వారా మద్దతు ధర వస్తుందని వెళితే దళారులతో కుమ్మక్కై మిగతా 5లో

గ్రామాల్లో పర్యటించిన డీపీవో

జన్నారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తపాలపూర్, ఇందన్‌పల్లి గ్రామాల్లో గురువారం డీపీవో వెంకటేశ్వర్‌రావు పర్యటించారు. నర్సరీలు, పారిశుధ్య పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వార డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. వైకుంఠధామం, కంపోస్టు, నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయన్నారు. ఆయన వెంట ఎంపీవో జలంధర్, పంచాయతీ కార్యదర్శులు రమేష్, చంద్రమౌళి , సిబ్బంది ఉన్నారు.

'ముక్కోటి'కి ముస్తాబు

నేడు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం



మందమర్రిలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

నస్పూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి దర్శనానికి వేంకటేశ్వర, వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. వైష్ణవులు ధనుర్మాసంను ఎంతో పవిత్ర మాసంగా భావిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ వాకిళ్ళు తెరు చుకుంటాయని, వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారం వద్ద భక్తులు వేకువ జామున నుంచే దర్శనం కోసం నిరీక్షిస్తారు. మహావిష్ణువు మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనం ఇస్తారని, అందుకే ముక్కోటి ఏకాదశిగా పేరు వచ్చిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. ముక్కోటి ఏకాదశి రోజు మహాశివుడు హాలాహలం మింగాడని, మహాభారత యుద్ధంలో భగవద్గీతను శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించారని భక్తుల విశ్వాసం. ఉపవాసం, జాగరణ నిర్వహిస్తారు.

సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందుగా వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారని ఆలయ పూజారి సముద్రాల వెంకటరమణా చార్యులు పేర్కొన్నారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి):మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు స్వామి వారి దర్శనం ఉంటుందని ఆలయం ప్రధాన అర్చకుడు గోవర్ధన భట్టాచార్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లు, నీటి వసతి, ఏర్పాట్లు చేశామని ఈవో ముక్త రవి తెలిపారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లోని వేంకటేశ్వర ఆలయ ముఖ ద్వారం వద్ద ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకునే భాగ్యం కలుగుతుందని పేర్కొంటున్నారు.

ప్రతిభ చాటితే 'ఆదర్శమే'..

- మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ
- 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు
- దరఖాస్తుల స్వీకరణకు ఫిబ్రవరి 28 వరకు గడువు
- ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష, జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలలు


కోటపల్లిలోని మోడల్ స్కూల్ , కళాశాల

కోటపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించేందుకు జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అధునాతన సదుపాయాలు, అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నాయి ఆదర్శ పాఠశాలలు. జిల్లాలోని ఐదు ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతీ పాఠశాలలో 6వ తరగతిలో వంద సీట్ల చొప్పున మొత్తం 500 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6 నుంచే ప్రారంభం కాగా ఫిబ్రవరి 28 వరకు గడువు ఉంది. 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులకు ఇది సదవకాశమని చెప్పవచ్చు.

● అధునాతన వసతులు

ఆదర్శ పాఠశాలల్లో పక్కా భవనాలతో పాటు విశాలమైన గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వృత్తి విద్యకు సంబంధించిన ఏర్పాట్లు కల్పించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తూ సీసీ కెమెరాల ద్వారా విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు. ఎస్ఎంఎంఎస్, ఎంసెట్, నీట్‌కు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్‌లో బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి ఉంది.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఇలా..

6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు www.telanganams.cgg.gov.inలో దరఖాస్తులు చేసుకోవాలి. ఇందుకోసం ఆధార్‌కార్డు, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌ఫోటోతో మీ సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, జనరల్ విద్యార్థులు రూ.200ల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులు చేసుకుని హార్డ్‌కాపీని సంబంధిత ఆదర్శ పాఠశాలల్లో అప్పగించాలి. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతికి సంబంధించి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, 7 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఆయా మోడల్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పరీక్షలు జరుగుతాయి.

● రాత పరీక్ష ఇలా...

తెలుగు, ఆంగ్లమాధ్యమంలో వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 5వ తరగతి సామర్థ్యానికి అనుగుణంగా తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్ల పాఠ్యాంశాలపై 25 మార్కుల చొప్పున ఐచ్ఛిక తరహాలో ప్రశ్నలు ఇస్తారు. వీటిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశానికి అవకాశం కల్పిస్తారు. అయితే లోకల్ మండలానికి సంబంధించిన విద్యార్థుల ప్రవేశాల తర్వాతనే ఇతర మండలాల విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం


కాలిన పత్తిని వేరు చేస్తున్న కూలీలు

వాంకిడి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందానిచౌరస్తావద్ద గల ఆర్పీ ఇండస్ట్రీయల్ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 11గంటల ప్రాంతంలో ఓ పికప్ వాహనం నుంచి పత్తిని అన్‌లోడ్ చేస్తుండగా అకస్మాత్తుగా సైలెన్సర్ నుంచి నిప్పురవ్వలు వచ్చి నిలువ ఉన్న పత్తిలో పడి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన జిన్నింగ్ మిల్లు సిబ్బంది ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో దాదాపు పదిక్వింటాళ్ల పత్తి కాలిపోయిందని సీసీఐ పన్నాలాల్ తెలిపారు.

గంజాయి సాగుచేసిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

● లక్ష రూపాయల జరిమానా

ఆసిఫాబాద్‌రూరల్/జైనూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుచేసిన కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలుశిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్ గురువారం తీర్పు ఇచ్చారు. జైనూరు సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనూరు ఎస్సై సీహెచ్ తిరుపతి సిబ్బందితో 14అక్టోబరు 2021న గౌరి గ్రామానికి చెందిన సిడాంభరత్ వ్యవసాయ క్షేత్రంలో గంజాయిని సాగుచేస్తున్నా డన్న సమాచారం మేరకు వెళ్లి తనిఖీచేయగా గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. అతన్ని విచారించగా గంజాయి సాగుచేస్తూ విక్రయా లకు పాల్పడుతున్నట్లు ఒప్పుకోవడంతో సీఐ హనూక్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చాడన్నారు. పీపీ జగన్మోహన్ సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నింతుడికి ఏడేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రమేష్, ఎస్సై సాగర్, లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తిర్యాణి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పదవతరగతి విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఎంఈవో అంజయ్య ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని కస్తూర్బా విద్యాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులఅభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. శనివారం నుంచి సంక్రాంతి సెలువుల నేపథ్యంలో ఇంటికివెళ్లినా పునఃప్రారంభం రోజు అందరూ రావాలన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కేజీబీవీలో ముగ్గుల పోటీలు..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో నాగసుధ, సిబ్బంది గీత, నాగజ్యోతి, మేఘరాణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ఎంవీఐ

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతనియమాలు పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జి కవిత అన్నారు. జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాలలో భాగంగా గురువారం బస్టాండు ఎదుట ఆటోస్టాండు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. వాహనదారులందరూ డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అనంతరం హెల్మెట్ లేకుండా వెళుతున్న వాహనదారులను ఆపి గులాబి పువ్వును ఇచ్చి హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది డి సంతోష్ కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సిర్పూర్‌కార్ పెర్సాపేన్ ఉత్సవాలు

సిర్పూర్(యు), జనవరి 9(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో గల సిర్పూర్‌కార్ ఆత్రం వంశీయుల పెర్సాపేన్ పుణ్యక్షేత్రంలో శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు కుల గురువు ఆత్రం లింబారావు కటోడ, ఆత్రం బల్వంత్‌రావు,పటేల్,ఆత్రం శ్రీరావురాజా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం తుమ్మ కార్యక్రమం ఉటుందన్నారు.ఈనెల 11న పురవీధులల్లో ఊరేగింపు, 12న జైనూర్ మండలంలో గల సతీక్ దేవులకు దర్శనంతోపాటు పెర్సాపెన్‌కు గంగాజలంతో అభిషేకం ఉంటుందన్నారు. 13న పెర్సాపెన్ మహాపూజ ఉటుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి

వాంకిడి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, సంఘసంస్కర్త షేక్‌ఫాతిమా జయంతిని గురువారం మండల కేంద్రంలోని జీతావన్ బుద్ధవిహార్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లాఅధ్యక్షుడు అశోక్, అంబేద్కర్ సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, హంసరాజ్ శ్యాంరావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: షేక్‌ఫాతిమా జయంతిని గురువారం బెజ్జూరు జడ్పీహెచ్‌ఎస్ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రప టానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత, మాజీఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం

సిర్పూర్(టి), జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోనవెల్లి, వెంపల్లి, సిర్పూర్ (టి)లోని పదవతరగతి విద్యార్థులకు అల్పా హారంను నాయకులు గురువారం ప్రారం భించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ అఖిల్, రాజు, కిశోర్, సలీం, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీఎంఎస్ ఆర్కే7 పిట్ కమిటీ నియామకం

శ్రీరాంపూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్కే7 గనికి చెందిన బీఎంఎస్ పిట్ కమిటీని గురువారం నియమించారు. ముఖ్యపర్యవేక్షకులుగా సింగరేణి కోల్‌మైన్స్ కార్మికసంఘ్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్ విచ్చేసి కమిటీని ప్రకటించారు. పిట్ కార్యదర్శిగా మోతెటదెలు, సహాయకార్యదర్శిగా కుంట రాజు, కోశాధికారిగా చవాన్ కరందాస్, రిలేఇన్‌చార్జులుగా మెట్ట నాగరాజు, ఎలిగేటి వెంకటేశ్, ఇండ్ల ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అనుగుల శ్రీకాంత్, మిడిపెల్లి అభిలాష్, సమ అశోక్, కట్కూరి కొండల్ రెడ్డిని ఎన్నుకున్నారు.

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ

మందమర్రి టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంస్థప్రగతి ప్రతిబింబించేలా 2025నూతన క్యాలండర్ ఉందని మందమర్రిజీఎం దేవేందర్ అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఆయన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మరో రెండు రోజుల నుంచి క్యాలండర్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నరేంద్ర సత్యనారాయణ, అక్బర్, ఆలీ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ మేనేజర్ గదిని ప్రారంభించిన జీఎం

రెబ్బెన, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఆధునీకీకరించిన ఫైనాన్స్‌మేనేజర్ గదిని గురువారం జీఎం ఎంశ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గది అందరికీ ఉపయోగపడేట్టు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కె రాజమల్లు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ పరీక్షలు నిర్వహించాలి

శ్రీరాంపూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ (క్లర్క్) రాతపరీక్షలు నిర్వహించి, ఖాళీలను భర్తీచేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్‌యూనియన్(ఏఐటీయూసీ) ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్‌లో వారు మాట్లాడారు. గతేడాది 360ఎక్స్‌టర్నల్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రకటించి, ఇంతవరకు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో ఒకవైపు క్లర్కుల కొరత తీవ్రంగా ఉండగా, ఆయా స్థానాల్లో జనరల్ మజ్దూర్లతో పనులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, క్లరికల్ స్టాఫ్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే ఐఎన్టీయూసీ లక్ష్యం

మందమర్రి టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధనే తమ ప్రధానలక్ష్యమని ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య తెలిపారు. గురు వారం ఏరియాలోని కేకే5గనివద్ద కార్మికులను సమస్యలను అడిగితెలుసు కున్నారు. ఈనెల12న తమయూనియన్ కార్యాలయంలో జనరల్‌బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, పిట్‌కార్యదర్శులు సమావేశవిజయవంతానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంశెట్టినరేందర్, సదయ్య, కల్పన, సదయ్య, మిట్ట సూర్యనారా యణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. ఉద్యోగులకు శాపం..

- కార్మికుల వేతనం నుంచి ఐటీ కట్
- కొందరికి సున్నా వేతనం
- పాన్, ఆధార్ అనుసంధానం చేసుకున్నా సమాచార లోపం
- సిబ్బంది నిర్లక్ష్యంతో కార్మికులకు నష్టం

శ్రీరాంపూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సింగరేణి పర్సనల్ విభాగం అధికారుల నిర్లక్ష్యం ఉద్యోగులకు శాపంగా మారింది. అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ఆర్కే7గనికి చెందిన ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారుల సమాచార లోపం కారణంగా ఉద్యోగుల వేతనాల నుంచి ఆదాయపు పన్ను శాఖ ద్వారా కోతలు పడ్డాయి. దీంతో కార్మికులు లబోదిబో మంటున్నారు.

నిర్లక్ష్యంతో నష్టం..

ఆర్‌కే7 గనికి చెందిన 102మంది ఉద్యోగులు ఆధార్, పాన్‌కార్డు అనుసంధానం చేసుకోలేదని గతంలో అధికారులు నోటీసు పెట్టారు. దీంతో వారంతా ఆరు నెలల క్రితమే అనుసంధానం చేసుకున్నారు. గనిపై ఉండే పర్సనల్ విభాగం కార్యాలయంలో అక్టోబరులోనే సమాచారం ఇచ్చారు. ఆ బాధ్యతలు చూస్తున్న అధికారి జీఎం కార్యాలయానికి సమాచారం ఇవ్వలేదు. దీంతో ఒకఉద్యోగికి నవంబరు వేతనంలో రూ.35వేలు ఐటీకట్ అయ్యాయి. అన్ని కటింగులుపోను రూ.9వేలవేతనం వచ్చింది. ఉద్యోగులు మళ్లీ సదరుఅధికారిని కలవగా వచ్చేనెల ఇలాజరగకుండా చూస్తానని తెలి పారు. కానీ సదరుఉద్యోగికి డిసెంబరు వేతనం నుంచి రూ.42వేలు ఐటీకట్‌అయ్యాయి. ఇలా ముగ్గురు ఉద్యోగులకు జరిగింది. అంతేకాకుండా 30 మంది వరకు ఉద్యోగులకు సున్నావేతనం వచ్చింది. దీంతోకార్మికులు జీఎం కార్యాలయంలో వాకబుచేశారు. మీరు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకున్నట్లుగా గనినుంచి తమకు సమాచారం ఇవ్వని కారణంగా 20శాతం స్లాబ్‌తో ఆదాయపు పన్ను కింద వేతనం కట్ అయ్యిందని తెలిపారు. గని అధికారిని అడుగగా అనుసంధానం చేసుకున్న వారి పేర్లుమెయిల్ పెట్టాలని ఉత్తర్వురాలేదని, ఇందులో తమతప్పేమిలేదని సమాధానం చెప్పారు.

నాకు సమాచారం ఇవ్వలేదు

- సంతన్, ఆర్కే7 సంక్షేమాధికారి

పాన్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని అందరికీ చెప్పాం. నోటీసు బోర్డులో పెట్టాం. కొందరు ఉద్యోగులు చేసుకున్నారు. అనుసంధానం చేసుకున్న వారివివరాలు ఇవ్వాలని జీఎం కార్యాలయం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవు. అందుకే మేం ఆ విషయం గురించి పట్టించుకోలేదు. వేతనంనుంచి కట్ అయిన డబ్బులు ఐటీ రిటర్న్ చేస్తే తిరిగి వస్తాయి.

టేకుమట్లలో పర్యటించిన జీఎం


మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలిస్తున్న జీఎం సూర్యనారాయణ

జైపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని టేకుమట్ల గ్రామంలో గురువారం శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ పర్యటించారు. ఇటీవల టేకుమట్ల-ఇందారం గ్రామ శివారులో సింగరేణికి చెందిన ఖాళీస్థలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయా లని స్థానికులు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో ఐకేగ్రూపు పీవో ఏవీరెడ్డితో కలిసి జీఎం స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట రక్షణాధికారి సతీష్, స్థానికనాయకులు సత్యనారాయణరావు, నర్సయ్య, రమేష్, సురేందర్ ఉన్నారు.

ఓబీ మట్టి లారీలను అడ్డుకున్న రైతులు


మట్టిలారీలను అడ్డుకుంటున్న రామారావుపేట గ్రామస్థులు

జైపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇందారం ఓపెన్‌కాస్టు గని నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలను గురువారం రామారావుపేట రైతులు అడ్డుకున్నారు. లారీలకు అడ్డంగా కూర్చుని ఆందోళన చేశారు. రామారావుపేట గ్రామం నుంచి గోదావరినదికి వెళ్లే రహదారులను సింగరేణి అధికారులు మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల సంవత్సరాలుగా ఉన్నరోడ్డును మట్టిపోసి మూసివేయడం ఏంటని ప్రశ్నించారు. ఆందోళన విషయం తెలుసుకున్న సింగరేణిఅధి కారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులువచ్చి రోడ్డుకు అడ్డంగావేసిన మట్టికుప్పలను తొలగించడంతో రైతులు శాంతించారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపించిన తర్వాతనే రోడ్డును మూసివేయాలని లేదంటే ఆందోళనలు తప్పవని రైతులు హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: ఎస్‌కేబీఎస్

శ్రీరాంపూర్, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సింగరేణి కార్మిక బిడ్డల సంఘం(ఎస్‌కేబీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకి నస్పూర్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, రక్షణపై జరిగే సదస్సుకు నరేందర్ ఎంపిక

మందమర్రిటౌన్, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): ఈనెల10,11తేదీల్లో రెండు రోజులపాటు విజయవాడలో నిర్వహిస్తున్న ఆరోగ్యం, రక్షణ మెరుగుపర్చుట, సంఘర్షణ పరిష్కారం, చర్చల నైపుణ్య పెంపుదలపై నిర్వహిస్తున్న సదస్సుకు ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ సదస్సుకు ఎంపిక చేసిన ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్టు కార్మికుడి మృతి

- బైఠాయించిన కుటుంబ సభ్యులు


మృతుడు సురేష్ (ఫైల్)

మంచిర్యాల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్‌షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు రాగుల సురేష్ (38) బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. వారు మాట్లా డుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అలాగే ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు. విద్యుత్ శాఖ అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మృతదేహం లభ్యం

హాజీపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లి కొత్తపల్లి గ్రామ శివారులోని మొగిలి సత్యం అనే రైతు పత్తి చేనులో కుళ్లిపోయి, గుర్తు పట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. గురువారం మృతదేహాన్ని పరిశీలించామన్నారు. వేంపల్లి పంచాయతీ సెక్రటరీ సత్తు ప్రతిభ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడి ఎత్తు 5.6 ఫీట్లు, వయస్సు 50 నుంచి 55 మధ్యలో ఉంటుందన్నారు.

అధికారి ఫోర్జరీ సంతకం చేసిన వ్యక్తి అరెస్ట్

దండేపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): రైతులను మభ్యపెట్టి ఓ అధికారి ఫోర్జరీ సంతకం చేసిన కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎంబడి సురేందర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. సురేందర్ ఈనెల 2న గ్రామానికి చెందిన రైతుల నుంచి సన్నరకం ధాన్యం కొనుగోలు చేశాడు. వీటిని తరలించడానికి ఫారం 10పై సంతకం కోసం గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేశాడు. ధాన్యాన్ని కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు తరలిస్తుండగా గిర్దావర్ భూమన్న పట్టుకున్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు సంతకం ఫోర్జరీ చేసిన నిందితుడు సురేందర్‌పై కేసు నమోదు చేసి గురువారం లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ వెల్లడించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

గర్మిళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న యువకుడిని మంచిర్యాల కాలేజీ రోడ్డులోని కల్వరి యువశక్తి అనాథాశ్రమం నిర్వహకుడు కల్వరి కుమార్ చేరదీశారు. కోటపల్లి ఎస్ఐ రాజేందర్ కల్వరి కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో కుమార్ యువకుడిని ఆశ్రమానికి పంపించాలని చెప్పగా గురువారం కానిస్టేబుల్ తిరుపతి యువకుడిని ఆశ్రమంలో అప్పగించారు. ఎక్కడైనా అనాథలు, మతిస్థిమితం లేని వారు కనిపిస్తే 9701973636కు ఫోన్ చేయాలని కల్వరి కుమార్ సూచించారు.

జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదు

జన్నారం/దండేపల్లి/లక్సెట్టిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తోట మల్లేష్ గురువారం తెలిపారు. మహ్మదాబాద్ సమీపంలోని కడెం ఉపకాలువలో ఉన్న జింక కళేబరం వార్తను ప్రసారం చేసిన రిపోర్టర్ రాజేష్‌పై సిబ్బందితో ఫిర్యాదు చేయించడం సరికాదన్నారు. జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయించడం హేయమైన చర్య అని ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చెట్ల రమేష్ అన్నారు.

మహిళల రక్షణ కోసమే షీ టీం

రామకృష్ణాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసమే షీ టీం పనిచేస్తుందని మహిళ కానిస్టేబుల్ జ్యోతి అన్నారు. గురువారం రామకృష్ణాపూర్ తవక్కల్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు మగ, ఆడ పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్ అనే అంశాలను వివరించాలన్నారు. ఒక వేళ అనుకోని సంఘటనలు చోటు చేసుకున్నట్లయితే వెంటనే 100 డయల్ చేయలన్నారు. షీ టీం సభ్యులు శ్రావణ్ కుమార్, పాఠశాల హెడ్ మాస్టర్ రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

దండేపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చని ఎస్సై ఉదయ్‌కిరణ్ అన్నారు. మేదరిపేటలో గురువారం సీసీ కెమెరాల వినియోగంపై వ్యాపారుస్థులు, కుల సంఘాల నాయకులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతీ గ్రామాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నప్పుడు సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చన్నారు. వ్యాపాస్థులు, గ్రామస్థులు, యూత్ సభ్యులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

వేమనపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నీల్వాయి గ్రామంలో గురువారం పలువురు లబ్ధిదారులకు మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 16 మంది లబ్ధిదారులకు రూ. 5,92,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు ఒడిల రాజన్న, గాలి మధు, ఆకుల లింగాగౌడ్, తిరుపతిరెడ్డి, పురుషోత్తం, చందు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

జన్నారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసిఉల్లా, డైరెక్టర్లను గురువారం మండల అంబేద్కర్ సంఘం నాయకులు సన్మానించారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు భరత్‌కుమార్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు ప్రభుదాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్, శ్రీకాంత్, బెంజమెన్, ప్రశాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కలమడుగు విద్యార్థికి రాష్ట్రస్థాయి బహుమతి


విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

జన్నారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ఇటీవల నిర్వహించిన బయోసైన్స్ టాలెంట్ పరీక్షలో కలమ డుగు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి మంతెన అంజన్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. విద్యార్థిని డీఈవో యాదయ్య, ఎంఈవో విజయ్‌కుమార్, హెచ్‌ఎం కట్ట రాజమౌళి, గైడ్ టీచర్ తిరుపతిలు అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని డీఈవో సూచించారు.

విద్యార్థుల అపార్ ఐడీని అప్‌డేట్ చేయించాలి

కాసిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలోని విద్యార్థుల వివరాలతో అపార్ ఐడీని అప్‌డేట్ చేయించాలని ఎంఈవో వెంకటేశ్వరస్వామి అన్నారు. గురువారం విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నోడల్ ఆఫీసర్ రమేష్ రాథోడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా...

3వ పేజీ తరువాయి..

ట్రాక్టర్ల ద్వారా రీచ్ నుంచి ఇసుకను చేరవేస్తున్నారు. ప్రారంభంలో బుకింగ్‌లు బాగానే ఉన్నా... క్రమంగా తగ్గుముఖం పట్టాయి. నవంబరులో 8800 ట్రిప్పులకు బుకింగ్‌లు ఇవ్వగా 35,200 మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించారు. డిసెంబర్‌లో 11,357 ట్రిప్పుల ద్వారా 45,400 మెట్రిక్ టన్నుల ఇసుకను అందించారు. నవంబరులో కేవలం 15 రోజుల వ్యవధిలో 35,200 మెట్రిక్ టన్నులకు ఆన్ లైన్ బుకింగ్ ఇవ్వగా, డిసెంబర్ నెల మొత్తానికి 45,400 మెట్రిక్ టన్నులే ఇచ్చారు. దాదాపు ఎనభై వేల మెట్రిక్ టన్నులు బుక్ చేయాల్సి ఉండగా, అందులో సగం మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేశారు. గోదావరి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పెద్ద మొత్తంలో ఇసుక తరలిపోతున్నందునే అధికారిక రీచ్‌లో బుకింగ్‌లు ఉండటం లేదని ట్రాక్టర్ యజమానులు ఆవేదన చెందుతున్నారు.

కిస్తులు కట్టలేని పరిస్థితుల్లో యజమానులు...

ముల్కల్ల వద్ద అధికారికంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌పై ఆధార పడి సుమారు 900 మంది ట్రాక్టర్ యజమానులు ఉన్నారు. ఇక్కడి ఇసుకను మంచిర్యాల తోపాటు నస్పూర్, మందమర్రి, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లికి చెందిన ట్రాక్టర్లు తరలిస్తాయి. అధికార రీచ్ నుంచి బుకింగ్‌లు లేని కారణంగా ఫైనాన్స్‌ల్లో ట్రాక్టర్ల నెలవారీ కిస్తులు చెల్లించలేని పరిస్థితుల్లో యజమా నులు ఉన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రీచ్ నుంచి తరలించే ఇసుక ట్రిప్పుపై ఒక్కోదానికి రూ.1050 యజ మానులకు వెళ్తుంది. ఒక్కో ట్రిప్పును తరలించడానికి లేబర్ చార్జీ రూ.300, డీజిల్ రూ.300, డ్రైవర్ వేతనం రూ.200, కూలీలకు టిఫిన్స్, టీలు మరో రూ.200 వరకు ఖర్చులు ఉంటాయని యజమా నులు చెబుతున్నారు. ఇవి పోను నెలవారీ ట్రాక్టర్ కిస్తు కింద కనీసం రూ.15వేలు, సంవత్సరానికి ఇన్సూరెన్స్ రూ.14వేలు, మూడు నెల కోసారి టాక్స్ రూ.1050 ఉంటుందని పేర్కొంటున్నారు. 900 ట్రాక్టర్ల ద్వారా రీచ్ నుంచి నెలలో సగటున 11,500 ట్రిప్పులు చేరవేస్తే మూడు రోజులకు ఒకసారి అవకాశం వస్తుందని, దీంతో నిర్వహణ భారమవుతుందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికా రులు ఇసుక అక్రమ రవాణాను నిలవరించగలిగితే పరిస్థితులు ఆశాజన కంగా ఉంటాయని ట్రాక్టర్ యజ మానులు చెబుతున్నారు.

అక్రమ రవాణాను అరికట్టాలి...



ట్రాక్టర్లకు ఆన్‌లైన్ బుకింగ్ అవకాశం కల్పించిన అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టకపోవ డంతో ఇబ్బందులు పడుతున్నాం. మూడు రోజులకు ఒక ట్రిప్పు వస్తే నిర్వహణ భారం పెరగడంతో ఒక ట్రాక్టర్‌ను అమ్ముకున్నా. యజమానుల పరిస్థితి దయనీ యంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు రీచ్ నుంచే ఇసుక తరలేలా చర్యలు తీసుకోవాలి.

- ఎర్ల సురేందర్, ట్రాక్టర్ యజమాని

పత్తి కొనుగోలుకు పడిగాపులు

3వ పేజీ తరువాయి

తమ వాహనాలను మూడు రోజులు పక్కన పెట్టి దళారుల వాహనాలను ముందుకు పంపి రోజుకు ట్రిప్పుల అవకాశం ఇస్తున్నారని తెలి పారు. రెండో శనివారం, ఆదివారం పండగ ఇలా నాలుగు రోజులు సెలవు వస్తున్నాయని, దీంతో ఏం చేయాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అందు బాటులో లేరని, ఫోన్‌లు లేపడం లేదని పేర్కొన్నారు. జిన్నింగు మిల్లు యజమానిని నిలదీస్తే మా ఇష్టమని, తమకు సంబంధించిన వాహనాలను ముందు పంపు తామని నిర్లక్ష్యంగా సమాధానాలు చెబు తున్నారని పేర్కొన్నారు.

రెండు రోజుల నుంచి ఇక్కడే ఉన్నా



రెండు రోజులుగా పత్తి మిల్లు దగ్గరే ఉన్నా. మా కన్నా వెనక ఉన్న దళారుల వాహనాలను ముందు పంపు తున్నారు. చలి, ఆకలితో పాటు సరైన తిండి లేక మిల్లు వద్దనే పడిగాపులు కాస్తున్నాం. అధికారులు తమకు న్యాయం చేయాలి.

- రాజు, కొత్తపల్లి

నానా కష్టాలు పడుతున్నాం



కష్టపడి పంట పండించుకుని పత్తికి మద్దతు ధర లభిస్తుందని మిల్లుకు వస్తే ఇక్కడ నానా కష్టాలు పడుతున్నాం. వరుసలో ఉన్న మా బండ్ల ను కాకుండా మా తర్వాత వచ్చిన వాటిని లోపలి కి పంపుతున్నారు. అధికారులు పట్టించుకోవాలి.

- పోచన్న, భీమిని

రహదారి భద్రత ఏదీ?

- రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిపాలు
- గతేడాది 132 మంది మృతి, 434 మందికి గాయాలు
- డ్రంకెన్ డ్రైవ్, అతి వేగమే కారణం

మంచిర్యాల క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయి... బయటకు వెళ్ళిన వ్యక్తి ఇంటికి చేరే వరకు భయంగానే ఉంటోంది... నిర్లక్ష్యం డ్రైవింగ్, అతివేగం, రహదారి నిబంధనలు పాటించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయి. ప్రమాదాల్లో పలువురు మృతి చెందుతుండగా ఎంతో మంది క్షతగాత్రులువుతున్నారు...

చిన్న నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయి. నిత్యం పోలీ సు, ఆర్టీవో అధికారులు వాహనాలను తనిఖీ చేసి జరి మానాలు విధిస్తున్నప్పటికీ ప్రజల్లో మార్పు రావడం లేదు. ముఖ్యంగా ట్రిబుల్ రైడింగ్, ఓవర్‌లోడ్ నివా రించాలని పలు మార్లు అవగాహన సదస్సులు నిర్వ హించినా మార్పు రావడం లేదు. 2023తో పోలిస్తే 2024లో 20శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించా లని, ట్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మద్యం తాగి వాహ నాలు నడపవద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే కుటుం బం వీధిపాలు అవుతుందని ఎన్ని నిబంధనలు పెట్టినా, జరిమానాలు వేసినా వాహన చోదకుల్లో మార్పు రావ డం లేదు. రోడ్డు ప్రమాదాల్లో కొందరు మృతి చెందగా మరి కొందరు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. మైన ర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలాగే ఫిట్‌నెస్ లేని వాహనాలను నడపవద్దని అధికారులు సూచిస్తున్నారు. కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్లు సరిగా లేకపోవడం, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేయడంవల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. యాక్సిండెంట్ బ్లాకులను గుర్తించి ఆర్టీవో, పోలీసు, ఆర్అండ్‌బి ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి చలాన్‌లకే పరిమితం అవుతున్నారని ప్రజలు విమ ర్శిస్తున్నారు.

గత సంవత్సరంలో జరిగిన ప్రమాదాలు....

గతేడాదిలో మంచిర్యాల జిల్లా కేంద్రం బెల్లంపల్లి, మందమర్రి, జైపూర్, శ్రీరాంపూర్, లక్సెట్టిపేట, జన్నారంలలో 132 మంది మరణించగా 434 మందికి గాయాలయ్యాయి. పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ ద్వారా 12,779 కేసులు నమోదు చేయగా 5469 మందికి రూ.76 లక్షల 99వేల 329 జరిమానా విధించారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు సీటుబెల్టు, హెల్మెట్ ధరించకపో వడం, ట్రిబుల్ రైడింగ్, వివిధ కేసుల్లో 2,15,927 కేసు లకుగాను రూ.5 కోట్ల జరిమానా విధించారు.



ఆర్టీవో ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రమాదాలపై పోలీసుల వినూత్న ప్రచారం

మంచిర్యాల క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు వినూత్నంగా ప్రచా రం చేస్తున్నారు. గురువారం ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్ చూపరులను ఆకర్షించింది. భద్రంగా ఉంటే నీకు నా దండం, లేకుంటే నా దండన అంటూ ఫ్లెక్సీపై యమధర్మరాజు ఫొటో ను ముద్రించారు. అంతే కాకుండా ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ చిత్రాల తో కూడిన పోస్టర్‌ను ఏర్పాటు చేశారు.

ఆర్టీవో ఆధ్వర్యంలో....

వాహనాల ఫిట్‌నెస్, సరియైన పత్రాలు లేకపోవడం, ఇన్సూరెన్స్ వాటిలో 780 కేసుల్లో రూ.59 లక్షల 29 వేల 807 జరిమానా విధించారు. అలాగే వివిధ కేసుల్లో ఫైన్ ద్వారా రూ. కోటి 20లక్షలు జరిమానా విధించారు. ఓవ ర్ లోడ్ కేసుల్లో 44 కేసులు కాగా 8లక్షల 46వేల 675 రూపాయలు జరిమానా విధించారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఒకే ప్రమాదంలో రెండు కుటుంబాల్లో విషాదం..

మంచిర్యాల పట్టణం దొరగారిపల్లికి చెందిన పత్తి నర్సింహ(40) భార్య రమాదేవితో కలిసి ఆదివారం రాత్రి బంధువులు మృతి చెందగా గద్దెరాగడికి వెళ్తు న్నా రు. అదే గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ముల్కల్ల ఉదయ్(29) ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నా యి. జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డు వద్ద జరిగిన ప్ర మాదంలో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. దీం తో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చు. 2025 సురక్ష అభియాన్‌లో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై పలు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. ఓవర్ లోడ్, ఫిట్‌నెస్ లేని వాహనాలను నడపడం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్, సీటు బెల్ట్ వంటివి ధరించపోవడం లాంటి చిన్న చిన్న కారణాలతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

- ఆర్టీవో సంతోష్

నిబంధనలు పాటించకపోవడం వల్లనే మరణాలు



ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువగా వాహనదా రులు హెల్మెట్ లేకపోవడం వల్లనే తలకు తీవ్ర గాయా లై చనిపోతున్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ వల్లనే ప్రమాదాలు పెరుగుతున్నాయి. జైపూర్ నుంచి లక్సెట్టి పేట వరకు బ్లాక్ పాయింట్స్‌ను గుర్తించి ఆర్అండ్ హెచ్ అధికారులకు నివేదిక ఇచ్చాం. శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్, తోళ్లవాగు, ఓవర్ బ్రిడ్జి, గుడిపేట కల్వర్టు మోరి వద్ద ప్రమాద ప్రాంతాలను బ్లాక్ పాయింట్లుగా గుర్తించాం.

- ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ

సమస్యలపై నేరుగా సంప్రదించాలి

- తహసీల్దార్ దిలీప్‌కుమార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ప్రజల సమస్యల పరిష్కారం ఎలా?

తహసీల్దార్ : దళారులు, మధ్య వర్తులు, బ్రోకర్లను నమ్మవద్దు. నేరుగా తహసీల్దార్ వద్దకే వస్తే సమస్యలకు తక్షణమే పరిష్కారం దొరుకుతుంది.

ఆంధ్రజ్యోతి : పట్టాదారు పాసు పుస్తకం, పలు సర్టిఫికెట్లకు ఎవరిని కలవాలి?

తహసీల్దార్ : సర్టిఫికెట్ల కోసం ముందుగా మీసేవలో దరఖాస్తు చేసు కోవాలి. నిర్దిష్ట కాల వ్యవధిలో 'మీసేవ ద్వారనే తీసుకోవచ్చు, మీకు ఏదైన సందేహాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి : రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ ఎవరిని సంప్రదించాలి?

తహసీల్దార్ : భూముల రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి : దరణి దరఖాస్తులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.

తహసీల్దార్ : అన్ని దరణి మాడ్యూ న్ల కలిపి 18పెండింగ్‌లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : భూ సమస్యలపై దరణిలో ఎలా దరఖాస్తు చేయాలి?

తహసీల్దార్ : సమస్యకు సంబంధిం చిన అన్ని ఆధారాలతో కార్యాలయంలో టెక్నికల్ టీంను సంప్రదించాలి. అనం తరం దరఖాస్తు చేసుకోవాలి

- లక్సెట్టిపేట

పీజీ మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

బెల్లంపల్లి, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ మొదటి సంవ త్సరం చదువుతున్న ఎంకాం, ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు ఈ నెల 18లోగా మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రక టనలో తెలిపారు. ఫీజును కళాశాల లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉం టుందన్నారు. వివరాలకు 99592 69975, 7013530814లో సంప్రదించా లన్నారు.

కేర్ టేకర్‌పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

కాసిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కాలేజీలో గర్ల్స్ హాస్టల్‌లో పనిచేయడానికి కేర్ టేకర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీతోపాటు బీఈడీ, డీఈడీ చేసిన స్థానిక మహిళలు మాత్రమే అర్హులని, వయస్సు 25 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. అర్హత గల మహిళ అభ్యర్థులు మండల విద్యావనరుల కేంద్రంలో ఈ నెల 13లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రజావేదిక వాయిదా

కాసిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించే 14వ విడత ప్రజావేదిక తాత్కాలికంగా వాయిదా పడినట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులకు హైద్రాబాద్‌లో అత్యవసర సమావేశం ఉన్న నేపథ్యంలో ప్రజావేదికను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.


సింగరేణి క్వార్టర్లకు యథావిధిగా విద్యుత్ సరఫరా



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి క్వార్ట ర్లలో విద్యుత్ అంతరాయం లేకుండా ఎమ్మెల్యే వినోద్ చర్యలు తీసుకు న్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలో విలేక రుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నాలుగు రోజులుగా పట్ట ణంలోని సింగరేణి క్వార్టర్లలో అధికారులు విద్యుత్ కనెక్షన్‌లను తొలగిం చడంతో ఈ విషయంపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ సింగరేణి సీఎండీ, జీఎంలతో మాట్లాడి విద్యుత్ పునరుద్ధరించాలని కోరారన్నారు. సింగరేణి యాజమాన్యం సైతం విద్యుత్ తొలగించమని పేర్కొందని తెలిపారు. మార్చి 31 వరకు సింగరేణి క్వార్టర్లలో యథావిధిగా విద్యుత్ సరఫరా అవుతుందని, కార్మికులు ఆందోళన చెందవద్దని సూచించారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే విద్యుత్ సరఫరా నిలి చిపోయిందని పేర్కొనడం సరైంది కాదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు సూరిబాబు, నాతరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి



మాట్లాడుతున్న పాలేరుల సంఘం నాయకులు

భీమారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 138 సర్వే నెంబరులోని భూములను తమకు ఇప్పించాలని బాధితులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లా డుతూ దొరలకు పాలేరుగా ఉండడంతో అందించిన భూమిని రెండేళ్ళ క్రితం వరకు సాగు చేసుకుని జీవిస్తుండగా బీఆర్ఎస్ ప్రభుత్వం అభి వృద్ధి పేరిట తమ భూములను బలవంతంగా లాక్కుందన్నారు. ఈ విషయంలో పాలేరుల సంఘం రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టా మన్నారు. తమకు ఫైనల్ ప్రొసీడింగ్ పత్రాలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే భూములను తిరిగి ఇస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. రాజం,మల్లయ్య, చంద్రయ్య, లచ్చయ్య, రాములు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

వేమనపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గొర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముల్కల్ల శంకర్ ఇటీవల మృతిచెందగా ఆయ నకు మంజూరైన బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా రూ.2 లక్షల చెక్కును గురువారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మృతుడి కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కాన్ చేయండి.. అభిప్రాయం తెలపండి : సీపీ

మంచిర్యాల క్రైం, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి): పోలీసుల పని తీరుపై అభిప్రా యం తెలపడానికి క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ సేకరించాలని, ఇందుకు స్కాన్ చేయండి, పోలీసు సేవలపై ప్రజాభి ప్రా యం తెలపాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పోలీసు కమి షనర్ కార్యాలయంలో అధికారులతో సమా వేశం నిర్వహించారు.

క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన పోస్ట ర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడు తూ ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతీ పౌరునికి కలిపించేలా పోస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ తనిఖీచేసే అధికారులు సిటిజన్ ఫీడ్ బ్యాక్ పోస్టర్లు కనిపించేలా చూడాలన్నారు. ఫిర్యాదులు, పిటీషన్, ఎఫ్ఐఆర్, ఈచలాన్ ఉల్లంఘ నలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశా లపై అభిప్రాయాల సేకరణకు క్యూఆర్‌కోడ్ ఏర్పాటు చేశామ న్నారు. ఆన్‌లైన్ జూమ్ సమావేశంలో అడి షనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద ర్‌రావు, కమిషనరేట్ పరిధిలోని ఇన్స్పెక్టర్లు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

గర్మిళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలం గాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ డైరీ, క్యా లెండర్‌ను గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడు తూ సమాజాభివృద్ధికి సైకాలజిస్టుల పాత్ర ఎంతో విలువైందని, విద్యార్థులు పరీక్ష సమ యంలో ఒత్తిడిని అధిగమించడానికి, యు వత గొప్ప వ్యక్తిత్వాన్ని అలవర్చుకునేం దుకు సైకాలజిస్టుల సేవలు ఎంతో అవ సరమని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సైకాలజిస్టు రంగు వేణుకు మార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుమనచైతన్య, వైస్ ప్రెసిడెంట్ రజిత, గౌరవ సలహాదా రుడు యోగేశ్వర్, సృజనమోహన్, కవిత, నాగరాజు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): యువ త క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. గురు వారం సింగరేణి పాఠశాల మైదానంలో యూత్ కాం గ్రెస్, సోషల్ మీడియా వారియర్స్ ఆధ్వర్యంలో కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌కు హాజర య్యారు. కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడాకారులను పరిచయం చేసు కున్నారు. ఎంపీ మాట్లాడుతూ విశాఖ ట్రస్టు ఆధ్వర్యం లో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. యువత క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకురావాలన్నారు. మారుమూల గ్రామాల నుంచి జాతీయ స్థాయికి ఎది గిన క్రీడాకారులు ఉన్నారని వారిని స్ఫూర్తిగా తీసుకో వాలన్నారు. క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేం దుకు రెండేళ్లుగా క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహిస్తు న్నామన్నారు. నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, రాయబారపు కిరణ్, జావేద్‌ఖాన్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

జైపూర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతా నికి పాటుపడాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే వివేక్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మండల నాయకులు ఎంపీని సన్మానించారు. పాలమా కుల రాజబాపురెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, సంపత్‌రెడ్డి, శీలం వెంకటేష్,అరిగెల శ్రీనివాస్‌గౌడ్, మధుకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామిని దర్శించుకున్న ఎంపీ

కోటపల్లి, (ఆంధ్రజ్యోతి): పారుపెల్లి గ్రామంలో స్వయంభుగా వెలిసిన కాలభైరవస్వామి ఆలయాన్ని ఎంపీ వంశీకృష్ణ సందర్శించారు. కాలభైరవునికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవున్ని కోరుకున్నానని తెలిపారు. ఫారెస్టు అధికారు లతో మాట్లాడి రోడ్లు, షెడ్లు వంటి మౌలిక సదుపా యాలను కల్పిస్తానని, ఆలయాన్ని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు.

మంచిర్యాల క్రైం, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్ట ణంలోని 5వ వార్డు శ్రీశ్రీ నగర్‌లో ముక్కిడి పోచమ్మ ఆలయంలో ఎంపీ వంశీకృష్ణ సందర్శించారు. పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, తదితర నాయకులు ఆయనను సన్మానించారు.

బీసీ రాజ్యాధికారం కోసం కలిసికట్టుగా ఉద్యమించాలి

లక్సెట్టిపేట/దండేపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): బీసీ రాజ్యాధికారం కోసం బీసీలంతా కలిసికట్టుగా ఉద్య మించాలని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంచాల శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్‌లు పిలుపునిచ్చారు. లక్సెట్టిపేట, దండేపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీసీ కుల జనగణన సర్వేను చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్య. దిక బీసీలను గెలిపించుకోని సత్తా చాటా లన్నారు. ఈనెల12న మంచిర్యాలలోని బెల్లం పల్లి చౌరస్తా సమీపంలో శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో బీసీ రాజ్యాధికారం సమితి ఆధ్వర్యంలో సమావేశం జరుగు తుందన్నారు. బీసీలంత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు వేముల మల్లేష్, పిట్టల రవిందర్, చంద్రకాంత్, రాజగురువ య్య, వొడ్నాల శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోళ్ల ఫారం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

మందమర్రిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చిర్రకుంట గ్రామంలో గురువారం కోళ్లఫారం షెడ్డు నిర్మాణానికి ఎంపీడీవో రాజేశ్వర్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్య, టీఏలు రాజమల్లు, కుమార్ , మాజీ ఎంపీటీసీ విజయ, ఫీల్డ్ అసిస్టెంట్ శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీటితో ఇబ్బందులు

కన్నెపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాలివాడలో మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో రోడ్డంతా బురదమయంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మురుగు నీరు పారుతున్న రోడ్డుపై నిరసన తెలిపారు. వారు మాట్లాడు తూ మాలివా డలో సిమెంటు రోడ్డు వేసి డ్రైనేజీ నిర్మించడం మర్చిపోయారని, దీంతో మురుగునీ రంతా రోడ్డుపైకి వచ్చి దుర్గంధం వ్యాపిస్తుం దన్నారు. ఈ విషయం అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.



అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు

జైనూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయిలో హైమన్‌డార్ఫ్ స్మారక క్రీడాపోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైనూర్ డివిజన్ ఏటీడీవో శ్రీనివాస్‌రావ్, సీఐ రమేష్, ఎస్ఐ సాగర్, మాజీ సర్పంచ్ కనక ప్రతిభ తదితరులు డార్ఫ్ దంపతుల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు యువత చెడుదారులకు వెళ్లకుండా ఆటపాటలతో ఉల్లాసంగా ఉండాలని సూచించారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి: ఎస్పీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీస్ ఆన్యువల్ గేమ్స్‌అండ్‌స్పోర్ట్స్ మీట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉంటారన్నారు. అలాంటివారు క్రీడల్లో పాలొగనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందనే ఉద్దేశ్యంతో జిల్లాలో స్పోర్ట్స్‌మీట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ మీట్‌లో పోలీసుఅధికారులు, సిబ్బంది ఉత్సాహకంగా పాల్గొనాలన్నారు. ఆటల్లో గెలుపుఓటములు సహజమని గెలుపోటములు కంటే టీమ్‌స్పిరిట్ గొప్పదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, అంజన్న, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాన్ని ఒక్కటిగానే ఉంచాలి

● సదాశివపేట, శివలింగాపూర్ గ్రామస్థుల రాస్తారోకో



కౌటాల మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, నాయకులు

కౌటాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మా గ్రామాన్ని వీడదీయవద్దు, ఒక్కటిగానే ఉంచాలని గురువారం కౌటాల గ్రామపంచాయతీలోని సదాశివపేట, శివలింగాపూర్ గ్రామస్థులు గురువారం మండలకేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా గ్రామసభ పెట్టకుండా కౌటాల గ్రామాన్ని ఎలా విడదీస్తారని పేర్కొన్నారు. 618జనాభాతో సదాశివపేట, శివలింగాపూర్‌ను కలిసి నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారన్నారు. ఈ విషయంపై ఎవరికీ సమాచారం లేదన్నారు. తమగ్రామాన్ని విడదీయవద్దని జిల్లాకలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులను సంప్రదించామని పేర్కొన్నారు. ఈ విషయంపై కోర్టుకు కూడా వెళ్లనున్నట్లు వారు తెలిపారు. కౌటాల గ్రామపంచాయతీని మేజర్‌గ్రామ పంచాయతీగా చేయాలే తప్ప విడదీసి అభివృద్ధిని అడ్డుకోకూడదన్నారు. అధికారుల తప్పిదంవల్ల తమకు అన్యాయం జరుగుతోందని ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టిసారించి తమకు న్యాయం చేయాలన్నారు. రాస్తారోకోలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, నాయకులు రాజేందర్‌గౌడ్, నక్కశంకర్, భీమయ్య, విజయ్, మల్లయ్య, మదుకర్, తిరుపతి, రవి, రాజన్న, సత్తయ్య తదితరులు ఉన్నారు.

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కౌటాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి) మంచిర్యాల జిల్లా సోమ గూడెంలో ఈనెలలో నిర్వహించిన కరాటే కుంగ్‌ఫూ చాంపి యన్‌షిప్ పోటీల్లో మండలంలోని మొగడ్‌దగడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎల్కార్ మోహిని, ఎల్కార్ పల్లవి, కనకే ప్రియాంక బంగారు పతకాలు సాధించారు. ప్రధానోపా ధ్యాయుడు ఇందురావ్, కరాటే మాస్టర్ అంజన్న, ఉపాధ్యా యులు విద్యార్థులను అభినందించారు.



సాధించిన పతకాలతో విద్యార్థులు

కొనసాగుతున్న ఆపరేషన్ స్మైల్





● బాల కార్మికుల విముక్తి కోసం జిల్లాలో రెండు బృందాలు

● బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు

● జిల్లాలో 335 జీపీలు, రెండు మున్సిపాలిటీలు

చింతలమానేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం చేపడుతోంది. జిల్లాలో జనవరి1 నుంచి 11వ విడత కార్యక్రమం ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. బాలకార్మికుల స్థావరాలుగా నిలిచే వ్యాపార సముదాయాలు, గోదాములు, కిరాణా షాపులు, పరిశ్రమలు, హోటళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, ఫెర్టిలైజర్ షాపులు ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. గతేడాది ఈకార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 68మంది చిన్నారులను గుర్తించారు. వీరిలో బాలకార్మికులు 58మంది ఉండగా, బాల్య వివాహం చేసుకున్న వారు ముగ్గురు, బడి మానేసిన పిల్లలు ఏడుగురు ఉన్నారు. ఈ యేడాది ఇప్పటివరకు 16మంది బాల కార్మికులను గుర్తించారు. వారిలో 12 మందికి చెందిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి చిన్నారులను అప్పగించారు. మిగతా నలుగురిని వసతిగృహంలో చేర్పించారు.

జిల్లాలో రెండు బృందాలు..

జిల్లా పరిధిలో 15 మండలాలు ఉండగా, 335 గ్రామపంచాయతీలు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలున్నాయి. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండు బృందాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంటేష్‌దోత్రే నేతృత్వంలో జిల్లా పోలీస్ అధికారులు, కార్మిక, బాలల హక్కుల పరిరక్షణ సమితి, శిశు సంరక్షణ, విద్యా శాఖల సమన్వయంతో ఈ బృందాలు పని చేస్తున్నాయి. ఈ బృందాల్లో ఎస్సై స్థాయి అధికారి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో మహిళా కానిస్టేబుల్, కార్మికశాఖ నుంచి ఒకరిని నియమించి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం చేపడుతున్నారు. చిన్నారుల తల్లిదండ్రులకు, బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించి బాలలకు బాసటగా నిలుస్తారు. అనాథ బాలికలను జిల్లాకేంద్రంలోని వసతి గృహంలో చేర్పించి వారికి విద్య, వైద్యం, వసతి, భోజనం వంటివి ఏర్పాటు చేస్తారు. దీనిద్వారా వారు విద్యావంతులుగా మారే అవకాశం ఉన్నది.

కార్యక్రమ విజయవంతానికి ప్రణాళికలు..

జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమ విజయ వంతానికి జిల్లా యంత్రాగం సమావేశాలు ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. రెండుబృందాల ఏర్పాటుతో పాటు చైల్డ్‌ట్రాక్ పోర్టల్, ముఖ కదలికలను గుర్తించే దర్పణ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగి స్తు న్నారు. బాల కార్మికులను గుర్తించి సమాచారం అం దించేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 1098పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

బాలకార్మికులను గుర్తిస్తే సమాచారం ఇవ్వాలి..

బి మహేష్, డీసీపీవో



జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం కొన సాగుతోంది. గతేడాది 68మందిని గుర్తించాం. బాలల ను పనుల్లో పెట్టుకుంటే చట్టప్రకారం కేసులు నమోదు చేయడమే కాకుండా వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లా యంత్రాగం సహకారంతో పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. ఎక్కడైనా కార్మికులను గుర్తిస్తే వెంటనే డయల్ 100లేదా 1098 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలి.



దుకాణాల్లో బాలకార్మికులను గుర్తిస్తున్న అధికారులు (ఫైల్)

రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన రోడ్డుభద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన జిల్లా రహదారుల భద్రతాకమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి పోలీసు,రెవెన్యూ, రవాణా, రోడ్డు భవనాలు, గ్రామీణాభివృద్ధి, గిరిజన ఇంజనీరింగ్, విద్యశాఖాధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలు,మండలకేంద్రాల్లో, పట్టణాల్లో రోడ్డు భద్రతనియమాలపై విస్తృతప్రచారం చేపట్టాలన్నారు. విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, పాటించాల్సిన నియమాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో గతసంవత్సరం 239 ప్రమాదాలు జరిగాయన్నారు. జిల్లాలో 45ప్రాంతాలను ప్రమా దాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు వేగ నిరోధ కాలను, సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహ దారుల మరమ్మతులు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ విస్తృతంగా చేపట్టాలని, కార్యక్రమంలో ఈఈ సురేష్, జిల్లా రవాణాశాఖాధికారి రాంచందర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి సీతారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి..

జిల్లాలో వివిధ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన నీటిపారుదల, రోడ్డు భవనాలు, సింగరేణి, రైల్వే, రెవెన్యూశాఖాధికారులతో జిల్లాలోని వివిధ ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు వంతెనలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సింగరేణి, రైల్వేలైన్ల విస్తరణకు అవసరమైన భూముల సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులైన కుమరం భీం, జగన్నాథ్‌పూర్, పీపీరావుప్రాజెక్టు, చెరువుల నిర్మాణం, కాలువల నిర్మాణం, రైల్వేలైన్ల ఏర్పాటులో సింగరేణి ఉపరితల గనుల ఏర్పాటుకు అవసరమైన భూముల కొరకు భూ సేకరణ ప్రక్రియను సమర్థవం తంగా నిర్వహించాలని తెలిపారు. అవసరమైన ప్రతి పాదనలు, రైతుల అంగీకారం తీసుకుని అవార్డులను రూపొందించాలన్నారు. అవార్డులు ఆమోదం పొందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం త్వరగా చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణపై కోర్టుల్లోఉన్న కేసులను సత్వరమే పరిష్కారమయ్యే విధంగా కోర్టులకు నివేదికలు సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖాధికారి గుణవంతరావు, ప్రభాకర్, సింగరేణి జీఎం శ్రీనివాస్, రెవెన్యూ, రోడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి..

జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు కృషిచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంపీడీవో, ఎంపీఆర్వో, కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులతో పంచాయతీల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో జరిగే అభివృద్ధితో రాష్ట్ర, దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ట్రెసా' క్యాలెండర్ ఆవిష్కరణ..

తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ వెంకటేష్‌దోత్రే ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్‌లు దీపక్ తివారి, డేవిడ్, కలెక్టరేట్ ఏవో మధుకర్, తహసీల్దార్‌లు, డీఈలు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



ముస్తాబయిన కేశవనాథ ఆలయం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని బ్రాహ్మణవాడలో గల కేశవనాథస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ, ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 5గంటల నుంచి ప్రత్యేకపూజలతోపాటు భక్తులకు ఉత్తర(వైకుంఠ) ద్వారం ద్వారా స్వామి వారి దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు ఒజ్జల నరేష్ శర్మ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి), జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీలో గెస్టఉపాధ్యాయులకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో నాగసుధ ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్టీ ఫిజికల్‌సైన్స్, సీఆర్టీ హిందీ, పీజీ సీఆర్టీ తెలుగు, పీజీ సీఆర్టీ నర్సింగ్‌పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పీఆర్టీ కోసం బీఎస్సీ బీఈడీ, పీజీ సీఆర్టీ కోసం ఎంఏ బీఎడ్ చేసి ఉండాలన్నారు. నర్సింగ్‌పోస్టు కోసం బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాంకిడి: వాంకిడికేజీబీవీలో గెస్ట్ ఉపాధ్యాయుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో మీనా ఒక ప్రకటనలో తెలిపారు. బయోసైన్స్, ఫిజికల్‌సైన్స్ కోసం బీఎస్సీ బీఈడీ, పీజీ సీఆర్టీ కోసం ఎంఏ బీఎడ్ చేసి ఉండాలన్నారు. నర్సింగ్ పోస్టు కోసం బీఎస్సీనర్సింగ్ కోర్సుచేసిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వణికిస్తున్న చలి..

● సిర్పూర్(యు)లో 5.2డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో గురువారం రాష్ట్రంలోని 5.2డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదయింది. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. తిర్యాణి మండలం గిన్నెధరిలో5.8, తిర్యాణిలో 7.2, కెరమెరిలో 7.5, వాంకిడిలో 7.8డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రతకు ప్రజలు నెగళ్లు వేసుకుని చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగం కావాలి

● ఏఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగ స్వామ్యం కావాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. గురువారం మండలంలోని గోవేన గ్రామంలో ఆదివాసీలకు పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి యవత భవిష్యత్‌ను నాశనం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా 200బ్లాంకెట్లను ఆదివాసీలకు పంపిణీ చేశారు. కార్యక్రమలో సీఐ బుద్ధేస్వామి, ఎస్సైశ్రీకాంత్ పాల్గొన్నారు.

పోతరాజు జాతరకు ట్రైబల్ కమిషనర్‌కు ఆహ్వానం

కెరమెరి, జనవరి9(ఆంధ్రజ్యోతి): ఈనెల 15నుంచి 17వరకు మండలంలో జరుగన్న పోతరాజు ధర్మరాజు జాతరకు రావాలని ట్రైబల్ కమిషనర్ శరత్‌కు ఆదివాసీ నాయకులు గురువారం ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ నాయకులు సిడాం వంశీ, రాజేశ్వర్, ధర్ము, బాపురావు, రాజు, ఎస్ రాజు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు

వాంకిడి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గులపోటీలు నిర్వహించారు. ప్రతిభాపాటవాలు చూపించిన విద్యార్థినులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్, తిరుపతి, సురేందర్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలి

● ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్ మండలం ఈసుగాం క్యాంపులో ఆయన మాట్లాడారు. నజ్రూల్‌నగర్‌లో చెరువులున్నప్పటికీ కాల్వల పరిస్థితి బాగా లేదన్నారు. అడ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న కాల్వలను ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అడ ప్రాజెక్టు నీళ్ల వదిలితే క్యాంపువాసులకు పుష్కలమైన నీరు వస్తుందన్నారు. తద్వారా ఏడాదికి మూడు పూటలు పండించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సిర్పూరు తాలుకా కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు పాల్గొన్నారు.

వనభోజనానికి హాజరైన ఆర్ఎస్పీ: కాగజ్‌నగర్ మండలం ఈసుగాం బసంతినగర్‌లో ఏర్పాటుచేసిన వనభోజన కార్యక్ర మానికి గురువారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజల్లో పాల్గొన్నారు.

పరామర్శ: కాగజ్‌నగర్ అన్నపూర్ణ హోటల్ యాజమాని సుదగొని జగదీష్‌గౌడ్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందగా గురువారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆయన కుటుంబీకులను పరామర్శించారు. తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

పతంగులతో పాటు పక్షులనూ ఎగరనిద్దాం: ఎఫ్ఆర్వో

సిర్పూర్(టి), జనవరి 9(ఆంధ్రజ్యోతి): పతంగులతో పాటు పక్షులనూ ఎగరనిద్దామని ఎఫ్ఆర్వో ఇక్బాల్‌హుస్సేన్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పతంగుల దుకాణాన్ని తనిఖీచేశారు. ఈసందర్భంగా మాటాడుతూ సంక్రాంతికి గాలిపటాలు ఎగురవేయడానికి కాటన్‌దారాలను మాత్రమే వాడాలన్నారు. చైనామాంజా అమ్మినా, నిలువ చేసినా అయిదేళ్ల జైలుశిక్ష, లక్షరూపాయల జరిమానాతోపాటు పక్షులకు, మనుషులకు, జంతువులకు మాంజావల్ల హానికలిగితే3-5 సంవత్సరాల జైలుశిక్ష, పదివేలజరిమానా పడుతుందన్నారు. ఆయనవెంట సెక్షన్ ఆఫీసర్ సుభాన్ గౌరి, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ 132కేవీ విద్యుత్‌ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9నుంచి 11గంటల వరకు సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూరు, చింతలమానేపల్లి, పెంచికలపేట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

బెజ్జూరు: బెజ్జూరు 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు బెజ్జూరు మండలకేంద్రం, చిన్న సిద్ధాపూర్ గ్రామాలకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ అంజల్ కుమార్ కోరారు.

యువత వ్యాపారరంగంలో రాణించాలి

● తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం మనోహర్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం మనోహర్ రావు

కాగజ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): యువత వ్యాపార రంగంలో రాణించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్‌మేనేజర్ మనోహర్ రావు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత వ్యాపారరంగంలో రాణిస్తే తెలంగాణ బ్యాంకు, భారతీయ యువశక్తి ట్రస్టు పెట్టుబడులు పెడుతుందన్నారు. ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిశ్రమల అధికారి ఎం అశోక్ మాట్లాడుతూ యువత స్వయంఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, స్వర్ణ ఫౌండేషన్ మేనేజర్ రీనాబిల్వాల్, వైస్ ప్రిన్సిపాల్ నరసింహ, భారతీయ యువశక్తి ట్రస్టు బృందం అశోక్, క్లస్టర్ హెడ్ పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

పులుల సంరక్షణకు కృషిచేయాలి: ఎఫ్‌డీవో



గిరిజనులకు బ్లాంకెట్‌లను అందజేస్తున్న ఎఫ్‌డీవో సుశాంత్

కాగజ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పులుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎఫ్‌డీవో సుశాంత్ అన్నారు. గురువారం మండలంలోని దరిగాం గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో మాట్లాడుతూ పులులను రక్షిస్తేనే అడవులకు మనుగడ ఉంటుందన్నారు. ఈవిషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అటవీప్రాంతాల్లో పులుల పాదముద్రలు కన్పిస్తే వెంటనే అటవీఅధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో శశిధర్‌బాబు, డీఆర్వో రమాదేవి, ఎఫ్‌బీవో బానయ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి



విద్యార్థినులతో షీ టీం సభ్యులు

ఆసిఫాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో బాలికలకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు గురైతే వెంటనే షీటీంలను సంప్రదించాలన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, వంటి వాటి వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు స్వప్న, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.